తూర్పు కాపు విద్యార్థులకు న్యాయం చేయాలి

తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం నేతలు

భీమవరం: తూర్పు కాపు విద్యార్థులకు తగిన న్యాయం చేయాలని తూర్పు కాపు విద్యా విజ్ఞాన అభివృద్ధి సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఓబిసి సర్టిఫికెట్లు తూర్పుకాపు విద్యార్థులకు అందించడంలో తీవ్ర జాప్యం ఏర్పడుతుందని, దీంతో అనేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం సంఘం నేతలు కలెక్టరేట్ కార్యాలయ అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ జిల్లాలోని పలు తహశీల్దార్ కార్యాలయాల్లో ఉత్తరాంధ్ర నుంచి మైగ్రేషన్ సర్టిఫికెట్లు సమర్పించినా, అధికారులు ఒబిసి సర్టిఫికెట్లు ఇవ్వడంలో ఆలస్యం చేస్తున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా సర్టిఫికెట్ జారీ ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బాకూరు నిరంజన్, శిడగం శ్రీనివాస్, దాసరి పెంటయ్య, సిరిపురపు వేణు, పాండ్రంకి శ్రీనివాస్, మునకాల సత్యనారాయణ, చిల్లా సత్యనారాయణ పాల్గొన్నారు.

చింతకాయల బాబూరావు ఆశయ సాధనకు కృషి

సంస్మరణ సభలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు

సభలో మాట్లాడుతున్న బివి.రాఘవులు

మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

మాట్లాడుతున్న గోపీమూర్తి

నివాళులర్పిస్తున్న సిహెచ్.నరసింగరావు


నివాళులర్పిస్తున్న మంతెన సీతారాం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

కార్మికోద్యమ నేత, సిపిఎం సీనియర్ నేత చింతకాయల బాబూరావు ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బివి.రాఘవులు పిలుపునిచ్చారు. సోషలిస్టు విప్లవం, కార్మిక సమస్యలపై మాట్లాడాల్సిన సమయంలో చింతకాయల బాబూరావు సంస్మరణ సభ జరుపుకోవాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. గురువారం స్థానిక కాపు కళ్యాణ మండపంలో కార్మిక, కమ్యూనిస్టు జిల్లా నేత చింతకాయల బాబూరావు సంస్మరణ సభ సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ అధ్యక్షతన జరిగింది. తొలుత బాబూరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ముఖ్యవక్త రాఘవులు మాట్లాడుతూ బాబూరావు నమ్మిన సిద్ధాంతం కోసం ఉద్యోగాన్ని, ఉపాధిని వదులుకుని, కార్మికుల కోసం, సోషలిజం కోసం తుదిశ్వాస విడిచే వరకు కట్టుబడి పని చేశారని కొనియాడారు. దేశంలో భూస్వాములు, పెట్టుబడిదారులు ఉన్నంతకాలం ఎర్రజెండా రెపరెపలాడుతుందన్నారు. అమెరికాలో కార్మికులకు గంటకు రూ.1200 వేతనం చెల్లిస్తుంటే, భారతదేశంలో మాత్రం ఉపాధి హామీ కూలీలకు రోజుకి రూ.160 చెల్లించడం దారుణమన్నారు. ప్రస్తుతం భారతదేశంలో కార్పొరేట్ ప్రభుత్వం అధికారంలో ఉందన్నారు. ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన సమయంలో అంబానీ ఆస్తి రూ.లక్ష కోట్లు ఉంటే, ప్రస్తుతం రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని, అదేవిధంగా అదానీ ఆస్తి రూ.50 వేల కోట్ల నుండి రూ.16 లక్షల కోట్లకు పెరిగిందని తెలిపారు. ఈ విధంగా కార్పొరేట్లు దేశాన్ని దోచుకుతింటుంటే కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వడానికి మనస్సు రావడం లేదని ధ్వజమెత్తారు. కార్మిక చట్టాలను తీసివేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకొచ్చారని, అలాగే రైతు నల్ల చట్టాలను దొడ్డిదారిన తీసుకొస్తున్నారని, విద్యుత్ సంస్కరణలు అమలు చేసి స్మార్ట్ మీటర్లను బిగించి పేదలపై భారాలు మోపుతున్నారని మండిపడ్డారు. ప్రధాని మోడీ ఏం చేసినా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నోరు మెదపడం లేదని మండిపడ్డారు. బాబూరావు సోషలిజం అనే పనిని మనకు ఇచ్చి వెళ్లారని, ఆయన ఆశయాన్ని మనందరం ముందుకు తీసుకెళ్లడం ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు శ్రీదేవి, సిద్ధార్థకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నరసింగరావు మాట్లాడుతూ ఒక వ్యక్తి ఒక ఆశయంతో పని చేయడం మామూలు విషయం కాదని, అది బాబూరావుకే సాధ్యమని కొనియాడారు. కార్మికులను సమీకరించి, వర్గ పోరాటం చేయడంలో బాబూరావు రాజీ పడలేదని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ జైలుశిక్ష అనుభవించినా ఎటువంటి భయం, ఆందోళనా లేకుండా సమరశీల ఉద్యమాలకు బాబూరావు ముందుకు సాగారన్నారు. ఆయన భౌతికకాయాన్ని పరిశోధన నిమిత్తం మెడికల్ కళాశాలకు అప్పగించడం గర్వకారణమని, వారి కుటుంబాన్ని ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు. సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం మాట్లాడుతూ బాబూరావు 43 సంవత్సరాల సుదీర్ఘ కాలం కలిసి పని చేశామన్నారు. దేశంలో ఆర్థిక వ్యత్యాసం ఉండకూడదని, అందరూ సమానంగా ఉండాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని అన్నారు. చైనాలో పేదరికం లేదని, అందరూ సమానంగా ఉన్నారని, అటువంటి సమ సమాజం భారతదేశంలో కావాలని కోరుకుంటున్నామన్నారు. బాబూరావు మృతి తీరని లోటు అని, అయితే ఆయన కార్మికుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారని అన్నారు. మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, సామాజికవేత్త డివిఎస్.వర్మ, ఉపాధ్యాయ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి, సిఐటియు ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల కార్యదర్శులు డిఎన్‌విడి.ప్రసాద్, కె.రాజారామ్మోహన్‌రాయ్, జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు, పట్టణ ప్రముఖులు మార్నీడి బాబ్జి, రవి అగర్వాల్, వివిధ సంఘాల నేతలు జివిఎల్.నరసింహారావు, డి.కళ్యాణి, పొగాకు పూర్ణ, మనోరమ, ఈతకోట తాతాజీ, యు.వెంకటేశ్వరరావు, ధర్మరాజు, లంక కృష్ణమూర్తి, నాగేంద్ర, కరెడ్ల రామకృష్ణ, జవ్వాది శ్రీను, సిరపరపు రంగారావు, పాలుపూరి సత్యనారాయణ, కండెల్లి సోమరాజు, చిర్ల పుల్లారెడ్డి, బంకురి యశ్వద, సత్యవతి, శేషుబాబు, శ్రీనివాస్, షేక్ వలీ, చైతన్య ప్రసాద్, ఆకుల రాజు తదితరులు పాల్గొన్నారు.

రెండు డివిజన్లతో జిల్లా?

నూజివీడు నియోజకవర్గం ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరు కృష్ణా జిల్లాలో కలిపేందుకు సుముఖం

ఐదు నియోజకవర్గాలు, రెండు డివిజన్లతో అతిచిన్న జిల్లాగా ఏలూరు

వేరే నియోజకవర్గాలను కలుపుతారా అంటూ జనాల్లో ఉత్కంఠ

ఏలూరు జిల్లాలోకి గణపవరం మండలం

పోలవరం జిల్లా ఏర్పాటు లేనట్టేనా..?

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఏలూరు జిల్లా ముఖచిత్రం మారనుందా.. రెండు రెవెన్యూ డివిజన్లతో అతి చిన్న జిల్లాగా అవతరించనుందా అంటే అవుననే సమాధానం వస్తోంది. మంత్రివర్గ ఉపసంఘం చర్చల సారాంశం అందుకు అద్దం పడుతోంది. గత ప్రభుత్వం పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికగా జిల్లాల విభజన చేసింది. అందులో భాగంగానే ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని కైకలూరు, నూజివీడు నియోజకవర్గాలను ఏలూరు జిల్లాలో కలిపింది. దీంతో ఏలూరు, ఉంగుటూరు, దెందులూరు, చింతలపూడి, పోలవరం, నూజివీడు, కైకలూరు మొత్తం ఏడు నియోజకవర్గాలు, మూడు రెవెన్యూ డివిజన్లతో జిల్లాగా ఏర్పాటైంది. భౌగోళిక పరిస్థితుల రీత్యా రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గంలో ఉన్న ద్వారకాతిరుమల మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపి, ఉంగుటూరు నియోజకవర్గంలోని గణపవరం మండలాన్ని పశ్చిమగోదావరి జిల్లాలో కలిపింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత జిల్లాల విభజనలో ఏర్పడిన సమస్యలపై మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఉపసంఘం జిల్లాలో పర్యటిస్తుందని పేర్కొన్నప్పటికీ అది జరగలేదు. ఉపసంఘం వద్దకు వచ్చిన వినతుల ఆధారంగా నివేదికను తయారు చేస్తోంది. ఎన్నికల సమయంలో నూజివీడు నియోజకవర్గాన్ని ఎన్‌టిఆర్ జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. అదేవిధంగా ఏజెన్సీ ప్రాంతాన్ని కలిపి పోలవరం జిల్లాను ఏర్పాటు చేస్తామని సైతం ప్రకటించారు. మంత్రివర్గ ఉపసంఘం చర్చల సారాంశం చూస్తే ఏలూరు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో నూజివీడును ఎన్‌టిఆర్ జిల్లాలో, కైకలూరును కృష్ణా జిల్లాలో కలిపేందుకు ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో ఏలూరు జిల్లాలో ఇక ఐదు నియోజకవర్గాల పరిధిలోని 19 మండలాలు మాత్రమే మిగులుతాయి. గణపవరం మండలాన్ని ఏలూరు జిల్లాలో కలిపితే 20 మండలాలు అవుతాయి. పోలవరం జిల్లా ఏర్పాటుపై ఉపసంఘం ఎటువంటి స్పష్టతా ఇవ్వలేదు. ఏజెన్సీ మండలాలను ఏలూరు జిల్లాలో ఉంచుతారా.. లేక చింతూరు, రంపచోడవరం రెవెన్యూ డివిజన్లతో ఏర్పాటు చేయాలని చూస్తున్న ప్రత్యేక అథారిటీ పరిధిలోకి తీసుకెళ్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఏజెన్సీ మండలాలను అథారిటీ పరిధిలోకి తీసుకెళ్తే ఏలూరు జిల్లా మరింత కుచించుకుపోయే పరిస్థితి ఏర్పడనుంది. ఐదు నియోజకవర్గాలతో జిల్లాగా ఏర్పాటు చేస్తారా.. లేక గోపాలపురంతోపాటు మరో నియోజకవర్గాన్ని కలుపుతారా అనే చర్చ సైతం జనాల్లో నడుస్తోంది. నూజివీడు డివిజన్ ఎన్‌టిఆర్ జిల్లాలో కలిపితే ఏలూరు జిల్లాలో కేవలం ఏలూరు, జంగారెడ్డిగూడెం రెవెన్యూ డివిజన్లు మాత్రమే మిగులుతాయి. ఆదాయ వనరులు సైతం బాగా తగ్గిపోతాయనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లాల విభజన సమస్యలపై స్పష్టత వచ్చే వరకూ అంతా సస్పెన్స్ కొనసాగనుంది.



ప్రజాప్రతినిధుల మౌనంపై చర్చ

జిల్లాల విభజనలో జరుగుతున్న పరిణామాలపై జిల్లాలోని ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది. ఏలూరు జిల్లా చిన్నదిగా మారితే ఆర్థిక వనరులు సైతం పెద్దగా ఉండవనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రెండు నియోజకవర్గాలను విభజిస్తున్నప్పుడు వేరే ప్రత్యామ్నాయం గురించి ప్రజాప్రతినిధులు మాట్లాడాలిగా అనే చర్చ జనాల్లో నడుస్తోంది.

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి

మధ్యాహ్నం భోజనాన్ని రుచి చూసిన కలెక్టర్ నాగరాణి

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, తద్వారా మానసిక, శారీరక ఎదుగుదలకు సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. భీమవరం పట్టణంలోని గునుపూడి పిఎస్‌ఎం బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ నాగరాణి గురువారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేసి డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలను స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. 936 మంది విద్యార్థులు కలిగిన ఉన్నత పాఠశాలలో విద్యార్థులందరూ వరుస క్రమంలో వచ్చి ఆహార పదార్థాలను వడ్డించుకుని భుజించడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థులతో కలిసి కలెక్టర్ నేలపై కూర్చుని భోజనం చేస్తూ కుశల ప్రశ్నలు వేశారు. పౌష్టికాహారం తీసుకుంటే చదువుల్లో, ఆటల్లో చురుగ్గా రాణించగలరని సూచించారు. జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలల్లోని వంటశాలల్లో అత్యంత పరిశుభ్రత పాటించాలని, వర్షాకాలంలో మరింత జాగ్రత్త వహించాలని సూచించారు. ఆడపిల్లలు ఇతర వ్యాపకాలకు దూరంగా ఉండాలని, చదువుపైనే దృష్టి ఉంచాలని సూచించారు. కలెక్టర్ వెంట భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి, సహాయ కమిషనర్ అరవవల్లి రాంబాబు, ప్రధానోపాధ్యాయులు బిఎస్‌ఎస్.సాయిప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

14 నెలలు గడుస్తున్నా అమలుకు నోచుకోని హామీలు

ఎపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ

కలెక్టరేట్ వద్ద చేనేత కార్మికుల ధర్నా

కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న చేనేత కార్మికులు

ప్రజాశక్తి - భీమవరం

చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిఎం.బాలకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ వద్ద సంఘం ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ చదలవాడ నాగరాణికి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ మాట్లాడుతూ వ్యవసాయం తర్వాత చేనేత ప్రధాన వృత్తిగా ప్రసిద్ధి చెందిందన్నారు. కార్పొరేట్ విధానాల వల్ల సంక్షోభంలో చిక్కుకుందని, తత్ఫలితంగా చేనేత కార్మికులు ఆకలిచావులకు బలవుతున్నారన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేనేతపై జిఎస్‌టి వేయటంతో చేనేత రంగం మరింత సంక్షోభంలోకి నెట్టబడిందన్నారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టి తగ్గించానని చెబుతున్నా చేనేతపై తగ్గించకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చేనేత కార్మికులకు 200 యూనిట్లు ఉచిత కరెంటు అమలు జరుపుతానని చెప్పి 14 నెలలు గడిచినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. చేనేత కార్మికులకు సంవత్సరానికి రూ.25 వేలు ఇస్తానని ప్రకటించినా అమలుకు నోచుకోలేదన్నారు. సహకార సంఘాలకు చెల్లించాల్సిన రూ.176 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఆప్కో సహకార సంఘాల వద్ద కొనుగోలు చేసిన బట్టలకు డబ్బు వెంటనే విడుదల చేయాలన్నారు. త్రిఫ్ట్ ఫండ్ కింద చేనేత కార్మికులకు ఇవ్వాల్సిన రూ.27 కోట్లు వెంటనే విడుదల చేయాలన్నారు. ఇళ్లు లేని చేనేత కార్మికులకు మూడు సెంట్ల స్థలంలో మగ్గం షెడ్డుతో కూడిన ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నారు. చేనేతపై జిఎస్‌టి పూర్తిగా రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి జోగేశ్వరరావు, అధ్యక్షులు చల్ల వీరభద్రుడు, నేతలు తాళ్ల కుమార్‌స్వామి, గుడిమెట్ల మలేశ్వరరావు, కాసా కోటేశ్వరరావు, వాసా నాగరాజు, వరద బసవ కోటయ్య, నీలా మహదేవరావు, వీరకోటి వీరయ్య, వాసా రామలింగం పాల్గొన్నారు.

తెరుచుకోని లాకులు.. రోడ్డుపైకి నీళ్లు

ప్రజాశక్తి - నరసాపురం

నిడదవోలు కాల్వకు నీటిని విడుదల చేయడం, నరసాపురం వద్ద లాకులు తెరుచుకోకపోవడంతో నరసాపురం-పాలకొల్లు రహదారిపై గురువారం కాల్వ నీరు పొంగి ప్రవహించింది. ప్రవాహ ఉధృతికి రోడ్డు అవతల వైపు కొంతమేర కోతకు గురవ్వడంతో పొలాల్లోకి నీరు చేరుతుందనే ఆందోళన రైతుల్లో నెలకొంది. అయితే అధికారులు ఎట్టకేలకు లాకులు తెరవడంతో రోడ్డుపైకి ప్రవాహం ఆగింది. నిడదవోలు కాల్వకు నీటి విడుదలను పై నుంచి ఐదు రోజులుగా నిలిపివేశారు. అయితే మూడు రోజుల నుంచి ఎండలు కాయడంతో రైతులు కాల్వకు నీరు ఇవ్వాలని కోరారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు కవిటం లాకుల వద్ద తెరిచారు. నీటి ప్రవాహం నరసాపురం వచ్చేసరికి లాకుల తలుపులు తెరుచుకోలేదు. దీంతో నీళ్లు రోడ్డుపైకి చేరాయి. దీంతో పాలకొల్లు వైపు వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అనంతరం లాకుల తలుపులు తెరుచుకోవడంతో సమస్య పరిష్కారమైంది. దీనిపై ఇరిగేషన్ డిఇ వెంకట నారాయణను వివరణ కోరగా సమస్యను పరిష్కరించామని తెలిపారు.

మమ్దానీ గెలుపుపై ఐలు హర్షం


మమ్దానీ గెలుపుపై హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

ప్రజాశక్తి - తణుకు

అమెరికాలో న్యూయార్క్ నగర మేయర్‌గా జోహ్రాన్ మమ్దానీ గెలుపు సామ్యవాదం గెలుపని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కామన మునిస్వామి అన్నారు. గురువారం స్థానిక బార్ అసోసియేషన్ హాల్ వద్ద న్యూయార్క్ మేయర్ గెలుపుపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మునిస్వామి మాట్లాడుతూ పెట్టుబడిదారీ వ్యవస్థకు పెట్టిన పేరైన అమెరికాలో పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ప్రచారం చేసిన మమ్దానీ గెలుపు ట్రంప్‌కు చెంపదెబ్బని అన్నారు. మమ్దానీని ఓడించాలని ట్రంప్ స్వయంగా ఎన్నికల ప్రచారం చేశారని గుర్తు చేశారు. మమ్దానీ భారత సంతతికి చెందిన వ్యక్తి కావడం భారత దేశ ప్రజలు గర్వించదగిన విషయమన్నారు. ట్రంప్ ప్రపంచ దేశాలపై అధికత్వాన్ని సాధించాలని ప్రయత్నిస్తున్న తన దేశంలో న్యూయార్క్ నగరంలో తన అభ్యర్థిని గెలిపించుకోలేకపోవడం అసమర్థతకు నిదర్శనమన్నారు. మమ్దానీ గెలుపు నిరుద్యోగుల, పేద, మధ్యతరగతి ప్రజల గెలుపని మునిస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చోడే గోపీకృష్ణ, న్యాయవాదులు జి.అంబేద్కర్, చింతపల్లి నాగేశ్వరరావు, డి.భాస్కరరావు, ముప్పిడి సుబ్బయ్య, షేక్ బాజీ, గూడూరి సూర్యనారాయణ, డి.అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రెండో శనివారం సెలవు కొనసాగించాలి

డిఇఒకు ఫ్యాప్టో నేతల వినతి


డిఇఒకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్యాప్టో నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల పనిదినాలు 220 కంటే ఎక్కువగా ఉన్నాయని, సుమారు జిల్లాలో 225 పని దినాలుగా ఉన్నాయని, డిజాస్టర్ హాలిడేస్ ఇచ్చిన సెలవులు కాంపన్సేట్ ఇవ్వకుండా రెండో శనివారం సెలవులు యథావిధిగా కొనసాగించాలని జిల్లా ఫ్యాప్టో నేతలు కోరారు. స్థానిక కలెక్టరేట్‌లో డిఇఒ నారాయణకు గురువారం రాత్రి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా ఛైర్మన్ పెన్మెత్స విజయరామరాజు, నేతలు జి.ప్రకాశం, పెన్మెత్స ఆర్‌విఎస్.సాయివర్మ, రమణరావు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ సారైనా 108 శాశ్వతమేనా..!


వీరవాసరం మండలానికి కేటాయించిన కొత్త 108 వాహనం

ప్రజాశక్తి - వీరవాసరం

వీరవాసరం మండలానికి కేటాయించిన కొత్త 108 వాహనం ఈసారైనా శాశ్వతంగా మండలానికి ఉంటుందా ఉండదా అనే సందేహం సర్వత్రా వ్యక్తమవుతోంది. గత కొన్ని సంవత్సరాలుగా పాత 108 వాహనం అందుబాటులో ఉంది. దీంతో అత్యవసర సమయాల్లో రోగులకు వైద్య సేవలు సకాలంలో అందని దుస్థితి ఎదుర్కొన్నారు. అయితే ఎట్టకేలకు మండలానికి మరో కొత్త 108 వాహనాన్ని వీరవాసరం మండలానికి కేటాయించారు. కూటమి నాయకులు, సామాజిక కార్యకర్తల విజ్ఞప్తి మేరకు ఎట్టకేలకు 108 వాహనం అందుబాటులోకి వచ్చింది. అయితే మండలానికి కేటాయించిన 108 వాహనం తాత్కాలికమో శాశ్వతమో తెలియని పరిస్థితి నెలకొంది. గతంలో అనేక సార్లు ఫిర్యాదుల నేపథ్యంలో కొత్త 108 వాహనాన్ని అందుబాటులో ఉంచడం రెండు, మూడు రోజులు తరువాత కొత్త వాహనం స్థానంలో పాత వాహనాన్ని కొనసాగించడం పరిపాటిగా కొనసాగుతోంది. ఈసారి కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందేమోనని ఆందోళన ప్రజల్లో నెలకొంది. మండలం లో సక్రమంగా పనిచేసే 108 వాహనం అందుబాటులో ఉంటే భీమవరం, పాలకోడేరు, పెనుమంట్ర, పెనుగొండ, పాలకొల్లు మండలాల పరిధిలోని గ్రామాల్లో అత్యవసర సమయాల్లో రోగులకు సకాలంలో వైద్య సేవలందే పరిస్థితి ఉంటుందని స్థానికులు అంటున్నారు. వీరవాసరం మండలానికి కేటాయించిన 108 వాహనాన్ని మండల కేంద్రంలో అందుబాటులో ఉంచాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మూడు చక్రాల వాహనాల కోసం దరఖాస్తు చేసుకోవాలి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

వికలాంగులు మూడు చక్రాల మోటార్ సైకిళ్లకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శారీరక వైకల్యం కలిగిన వారు ఈ మేరకు మూడు చక్రాల మోటార్ వాహనాలకు www.apdascac.ap.gov.in ఆన్‌లైన్ ద్వారా నిబంధన మేరకు దరఖాస్తు చేయాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం సంబంధిత ధ్రువపత్రాలతో కలిపి దరఖాస్తును ఈ నెల 25వ తేదీ లోపు సహాయ సంచాలకులు, వికలాంగుల సంక్షేమ శాఖ కార్యాలయం వద్ద అందజేయాలన్నారు. దరఖాస్తుదారుని వయసు ఈ ఏడాది నవంబర్ 25 నాటికి 18 నుండి 45 సంవత్సరాలు మధ్య ఉండాలన్నారు. శారీరక వైకల్యం ఒకటి లేదా రెండు కింది భాగాలు ప్రభావితమై 70 శాతం లేదా అంతకంటే ఎక్కువ కలిగి ఉన్నవారు అర్హులన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించి ఉండకూడదని, దరఖాస్తుదారుడు జిల్లాకు చెందిన వారే అయి ఉండాలని తెలిపారు. కనీసం 10వ తరగతి విద్యార్హతతో ఒక సంవత్సరం అనుభవం ఉన్న వేతనం పొందుతున్న ఉద్యోగులు అర్హులని తెలిపారు. దరఖాస్తుతో పాటు సెల్ఫ్ అటెస్టెడ్ ధ్రువ పత్రాలు, జిల్లా మెడికల్ బోర్డు ద్వారా జారీచేసిన సదరం ధ్రువ పత్రం, ఆధార్ కార్డు, పదో తరగతి ఆపై విద్యార్హతలకు సంబంధించిన ధృవీకరణ పత్రాలు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగలు వారైన కుల ధ్రువీకరణ పత్రం, తాజా ఆదాయ ధ్రువ పత్రము, విద్యార్థుల కోసం బోనఫైడ్ సర్టిఫికెట్, స్వయం ఉపాధి ఉద్యోగుల కోసం ఉపాధి ధ్రువ పత్రం, పూర్తిగా మనిషి కనపడేలా తీయించుకున్న పాస్ పోర్ట్ సైజు ఫొటో, ఇంతకూ ముందు వాహనం పొందలేదని స్వీయ ప్రకటన జత పరచాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి కలిగిన వికలాంగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

సోషలిజమే సమస్యలకు పరిష్కారం

సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు

ఘనంగా సిఐటియు అఖిలభారత మహాసభ సందర్భంగా సదస్సు

ఏలూరు జ్యూట్‌మిల్లు సెంటర్ నుంచి సబాస్థలికి భారీ ప్రదర్శన

పెద్దఎత్తున హాజరైన కార్మికులు, మహిళలు

అభివాదం చేస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కొద్దిమంది వ్యక్తుల వద్ద పోగుబడిన సంపద, పెట్టుబడిదారీ విధానం పతనానికి దారితీస్తుందని సిఐటియు ఉమ్మడి రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి బివి.రాఘవులు, ఇతర వక్తలు అన్నారు. స్థానిక సీతారామ భర్తీయా కళ్యాణ మండపంలో గురువారం సిఐటియు ఆధ్వర్యంలో 'ప్రపంచ పరిణామాలు–సోషలిజమే పరిష్కారం' అనే అంశంపై రాష్ట్ర సదస్సు సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు అధ్యక్షతన జరిగింది. తొలుత స్థానిక జ్యూట్‌మిల్లు సెంటర్ నుంచి కోటదిబ్బ వద్ద ఉన్న సీతారాం భర్తీయా కళ్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్మికులు, నేతలు ఎర్రజెండాలు చేతపట్టి సిఐటియు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం సదస్సు వేదికపై బుట్టాయగూడెం అంగన్వాడీ కార్యకర్తల ప్రదర్శించిన గిరిజన నృత్యం అందరినీ అలరించింది. సదస్సు ప్రారంభంలో సిఐటియు పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల బాబూరావు చిత్రపటానికి రాఘవులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బివి.రాఘవులు మాట్లాడుతూ పెట్టుబడిదారీ విధానం పేదల పొట్టలు కొట్టి, సంపదను కార్పొరేట్ శక్తుల కబంధహస్తాల్లో బంధిస్తుందని, నేటి ప్రపంచ పరిణామాలే దీనికి ఉదాహరణ అని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కార్పొరేట్, సామ్రాజ్యవాద అనుకూల విధానాలకు వ్యతిరేకంగా జరిగిన న్యూయార్క్ మేయర్ ఎన్నికల ద్వారా ప్రజలు తమ సంఘటిత శక్తిని ప్రపంచానికి చాటారని ప్రశంసించారు. రాబోయే కాలం కమ్యూనిస్టులకు సానుకూల వాతావరణం ఏర్పడబోతుందని, మార్పు అనివార్యం అని తేల్చి చెప్పారు. సోషలిజమే అన్ని సమస్యలకూ పరిష్కారమన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు, విజయవాడ మాజీ డిప్యూటీ మేయర్ వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉద్యోగ, కార్మిక వ్యతిరేక పాలన సాగుతుందన్నారు. సంపద సృష్టి అంతా కార్మికవర్గంతోనే సాధ్యమన్నారు. గత ప్రభుత్వంలో అంగన్వాడీలు, ఆశాలు తదితర కార్మికుల జీతాల పెంపు కోసం పోరాటాలు చేస్తే తెలుగుదేశం నాయకులు శిబిరాలకు వచ్చి మద్దతు తెలిపి, తమ ప్రభుత్వం రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. 18 నెలలు గడిచినా ఇప్పటికీ కార్మికుల సమస్యలు పరిష్కరించ లేదని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్ఎస్ఎస్ నాయకులు మాట్లాడుతూ సెక్యులరిజం, సోషలిజం రాజ్యాంగంలో ఉండకూడదని చెబుతున్నారన్నారు. కార్పొరేట్లకు దాసోహమై మోడీ ప్రభుత్వరంగ సంస్థలను సర్వనాశనం చేశారన్నారు. కేరళ పేదరికం లేని రాష్ట్రంగా నిలిచిందని, కమ్యూనిస్టుల వల్లే ఇది సాధ్యమైందన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు ఏ సమస్య వచ్చినా సిఐటియు ముందుంటుందన్నారు. దేశంలో మోడీ పాలన వచ్చాక కార్మికుల హక్కులు కాలరాస్తున్నారని, ఈ నేపథ్యంలో సిఐటియు జాతీయ మహాసభ ద్వారా కార్మికుల సత్తా చాటి చెప్పాల్సిన అవసరం ఉందని అన్నారు. మహాసభ విజయవంతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్ మాట్లాడుతూ సిఐటియు నిర్వహించే ప్రతి కార్యక్రమంలోనూ యుటిఎఫ్ భాగస్వామ్యం ఉంటుందని, సిఐటియు జాతీయ మహాసభ మన రాష్ట్రంలో జరగడం గర్వకారణమని, మహాసభ విజయవంతానికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి జివిఎల్.నరసింహారావు, జనవిజ్ఞాన వేదిక పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్.రమేష్, ఉద్యోగ సంఘ నాయకులు ఎల్.విద్యాసాగర్ తదితరులు మాట్లాడుతూ సిఐటియు జాతీయ మహాసభకు విస్తృత ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని, దీనికి తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం సిఐటియు నాయకులు నాగమణి, ఇస్సాక్ ప్రత్యేక గీతం ఆలపించారు. ఎల్ఐసి ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, సిఐటియు నాయకులు జి.రాజు, పి.భారతి, కె.పోశమ్మ, ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందరయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవులు

రగ్బీ రాష్ట్రస్థాయి పోటీలకు కెపిపాలెం విద్యార్థుల ఎంపిక

ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం ఇందిర

ప్రజాశక్తి - మొగల్తూరు

కెపి పాలెంలోని జెడ్పి ఉన్నత పాఠశాల విద్యార్థులు రగ్బీ ఆటలో రాష్ట్ర పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయిని పితాని ఇందిర తెలిపారు. అండర్ 17 బాలుర విభాగంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెంలో నిర్వహించిన రగ్బీ ఆటలో పాఠశాలకు చెందిన బి.నాగేంద్ర, జి.డానియేల్ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా గురువారం విద్యార్థులను అభినందించారు. ఇందిర మాట్లాడారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో ముందుంటారని ఆమె తెలిపారు. ఈనెల 28, 29 తేదీల్లో నెల్లూరులో నిర్వహించే రగ్బీ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఫిజికల్ డైరెక్టర్ గుత్తుల జయకుమార్, నాగేంద్ర, దానియేలును ఎంఇఒ సాయిరామ్, యు.శామ్యూల్ జాన్, ఇందిరా పాఠశాల సిబ్బంది, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ ఇందిర అభినందించారు.

ఓటర్ల జాబితా రూపకల్పనపై దృష్టి పెట్టాలి

భీమవరం:ఓటర్ల జాబితా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ రూప కల్పనపై జిల్లా ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ తెలిపారు. గురువారం ఓటర్ల ప్రత్యేక జాబితా తయారీపై కలెక్టర్లతో వివేక్ యాదవ్ వర్చువల్ విధానంలో శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఓటర్ల జాబితా రూపకల్పనకు బిఎల్ఒలు సర్వే చేయాలన్నారు. 2002 సంవత్సరం నాటి ఓటర్లు, 2025 ఓటర్ల జాబితాతో పోల్చి విచారణ చేయాలన్నారు. ఇంటింటా ఓటర్ల సర్వే విచారణ జరపాలన్నారు. 2002లో ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారు ఆధారాలు చూపించాల్సిన అవసరం లేదన్నారు. బిఎల్ఒలు ఇంటింటా సర్వే చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఓటర్ల ధ్రువీకరణ పత్రాల పరిశీలన తప్పనిసరిగా చేపట్టేలా అధికారులకు శిక్షణ ఇవ్వాలన్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ ఓటర్ల జాబితా రూపకల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. డిఆర్ఒ బి.శివనారాయణ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పిహెచ్‌సి సూపర్‌వైజర్ మురళీకృష్ణ మృతి

గణపవరం:గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సూపర్ వైజరుగా పనిచేస్తున్న ఎం.బాల మురళీకృష్ణ (54) బుధవారం రాత్రి దిన రామచంద్రాపురంలో ఆయన నివాసంలో మృతి చెందినట్లు పిహెచ్‌సి డాక్టర్ పి.కిరణ్మయి గురువారం తెలిపారు. మురళీకృష్ణ ఆయుదు నెలల క్రితం బదిలీపై గణపవరం వచ్చారని, ఆయన సొంతఊరు విజయవాడ దగ్గర గొల్లపూడి అని తెలిపారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారని తెలిపారు. వారు గొల్లపూడిలో ఉన్నారని, మురళీకృష్ణ ఆరోగ్యకేంద్రంలో విధులు నిర్వహిస్తూ దిన రామచంద్రాపురంలో అద్దె ఇంటిలో ఉంటున్నారని చెప్పారు.

విద్యార్థినులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

పాలకొల్లు:కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ కార్యక్రమాలను విద్యార్థినులు అందిపుచ్చుకొని ఒక్కో కుటుంబం నుంచి ఒక్కో పారిశ్రామికవేత్త తయారు కావాలని పాలకొల్లు డిఎన్ఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ శోభారాణి కోరారు. కళాశాలలో విద్యాభ్యసిస్తున్న విద్యార్థినులకు నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ తరపు నుంచి మంది పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారవేత్తలుగా ఏ విధంగా తయారు చేయొచ్చనే అంశంపై శిక్షణ కార్యక్రమం, సదస్సు ఏర్పాటు చేశారు. సి.రవి శంకర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిసిడి ఒపి లోకమాన్, కె.మహాలక్ష్మి, ఎ.సంధ్యా, ఆర్.శైలజ పాల్గొన్నారు.

సత్యనారాయణ కుటుంబానికి పలువురి పరామర్శ

పోడూరు:జున్నూరు గ్రామానికి చెందిన సొసైటీ విశ్రాంత ఉద్యోగి కుంపట్ల సత్యనారాయణ (69) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆయన కుటుంబ సభ్యులను గురువారం పలువురు నాయకులు పరామర్శించారు. సత్యనారాయణ జున్నూరు సొసైటీ ఉద్యోగిగా బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేశారు. ఆయనకు భార్య వరలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సత్యనారాయణ ఈ నెల 3వ తేదీన గణపవరం మండలం చిలకంపాడు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. చికిత్స పొందుతూ ఈ నెల 4వ తేదీన మృతి చెందారు. ఆయన మృతికి సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి కొప్పర్తి నరసింహమూర్తి, సొసైటీ ఛైర్మన్ దేవళ్ల ప్రసాద్, మాజీ ఛైర్మన్లు డిటిడిసి బాబు, పెనుమత్స సుబ్బరాజు, పాలవలస తులసీరావు, ఎఎంసి మాజీ డైరెక్టర్ జమ్ము మృత్యుంజయరావు, మాజీ ఎంపిటిసి భూపతి రాజు సత్యనారాయణ రాజు, సొసైటీ సిఇఒ పెచ్చెట్టి రామకృష్ణ, తదితరులు సత్యనారాయణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ధర్మారావు ఫౌండేషన్ సాయం

పాలకొల్లు :పాలకొల్లులో ఆర్టిస్ట్ అండ్ పెయింటర్స్ అసోసియేషన్ నూతనంగా నిర్మిస్తున్న ఫస్ట్ ఫ్లోర్ నిర్మాణానికి అవసరమైన 100 సిమెంట్ బస్తాలను ధర్మారావు ఫౌండేషన్ ఆధ్వర్యాన గురువారం అందజేశారు. మంత్రి, ధర్మారావు ఫౌండేషన్ ఛైర్మన్ నిమ్మల రామానాయుడును సంఘం భవన నిర్మాణానికి సిమెంట్ బస్తాలను ధర్మారావు ఫౌండేషన్ నుంచి ఇప్పించాలని కోరగా సమకూర్చి అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టిస్ట్ అండ్ పెయింటర్స్ సంఘం అధ్యక్షుడు మాట్లాడారు. మంత్రి రామానాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. ఫౌండేషన్ సభ్యులు రావూరి వెంకట అప్పారావు, పీతల శ్రీనివాస్, పెచ్చెట్టి బాబు, గండేటి వెంకటేశ్వరరావు, మేడిశెట్టి కేశవ పాల్గొన్నారు.

వాసుకు మాతృవియోగం

పెనుమంత్ర:మాజీ ఎఎంసి డైరెక్టర్, టిడిపి గ్రామ అధ్యక్షులు గంటా వీర వెంకట శ్రీనివాస్ (గంటా వాసు) మాతృమూర్తి గంటా రామ సీత (61) బుధవారం తుది శ్వాస విడిచారు. ఆమెకు ఇద్దరు కుమారులు, భర్త రామ తులసీరావు ఉన్నారు. ఒక కుమారుడు టిడిపిలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ ఎమ్మెల్యే పితాని సత్యనారాయణకు అత్యంత సహితుడుగా వ్యవహరిస్తున్నారు. పలువురు సంతాపం తెలిపారు.

విద్యార్థులకు భోజనం ప్లేట్లు అందజేయాలి

తాడేపల్లిగూడెం:తాడేపల్లిగూడెం రూరల్ మండలం కొమ్ముగూడెం గ్రామ సర్పంచి తాడేపల్లి బేబీ, శ్రీను దంపతుల ఆధ్వర్యంలో గురువారం ఎలిమెంటరీ పాఠశాలలో తాడేపల్లి బేబీ తండ్రి జ్ఞాపకార్థం స్కూల్ విద్యార్థులకు తాడేపల్లిగూడెం నియోజకవర్గం ఇన్‌ఛార్జి భవన, ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు ఛైర్మన్ శ్వలవల మల్లికార్జునరావు (బాబ్జి) చేతుల మీదుగా భోజనం ప్లేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పరిమి రవికుమార్, కుసులూరి రఘు ప్రసాద్, సూర్పన వెంకట్రావు, కూచిపూడి సుబ్రహ్మణ్యం, ఆలపాటి నాగేశ్వరరావు, ముప్పిడి రమేష్ పాల్గొన్నారు.

ఇఒ రామచంద్ర కుమార్‌కు ఉద్యోగోన్నతి

నరసాపురం:పట్టణంలోని అమరేశ్వర దేవస్థానం ఆలయాల గ్రూప్స్ ఇఒ ఆర్‌వివిఎస్.రామచంద్ర కుమార్‌కు ప్రభుత్వం ఉద్యోన్నతి కల్పించింది. గ్రేట్–3 ఇఒగా పని చేస్తున్న ఆయనకు గ్రేడ్ –2 ఇఒగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రామచంద్ర కుమార్‌ను ఆలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలి

మొగల్తూరు:యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని ఆరోగ్యంగా ఉండాలని ఎస్ఐ జి.వాసు అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి కొండావారిపాలెంలో విజయ్ అకాడమీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షటిల్ కోర్టును గురువారం రాత్రి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యువత వ్యసనాల బారిన పడకుండా ఆరోగ్యంగా ఉండాలన్నారు. సొసైటీ పర్సన్ ఎం.రాంబాబు, జౌదుల విజయబాబు, గొల్ల డేవిడ్, ఆనందరావు, కొత్తపల్లి నలిన్, ఎస్.దేవదాస్ పాల్గొన్నారు.

ఉండి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో విచారణ

ఉండి:ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తన ఆస్తికి సంబంధించిన అక్రమ రిజిస్ట్రేషన్‌ను ఉండి సబ్ రిజిస్ట్రార్ సుధారాణి చేస్తున్నారని గణపవరానికి చెందిన కురెళ్ల రాజకుమార్ ఏలూరు శాఖకు చెందిన డిఐజి కార్యాలయం వద్ద కుటుంబ సమేతంగా ఆందోళన నిర్వహించడంతో గురువారం ఉండి సబ్ రిజిస్ట్రార్‌లో విచారణ నిమిత్తం అత్తిలి రిజిస్ట్రార్ సత్యనారాయణను నియమించారు. సత్యనారాయణ కోర్టు పని నిమిత్తం వెళ్లడంతో అతనికి సంబంధించిన సీనియర్ అసిస్టెంట్లు అలీ మరో వ్యక్తి గురువారం ఉండి కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా రాజకుమార్ మాట్లాడుతూ అధికారులు విచారణ చేయడం సంతోషకరమని తెలిపారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ సుధారాణి బుధవారం పెద్దమనుషుల సమక్షంలో రాజీకి వచ్చి సాయంత్రం ఉండి కార్యాలయంలో తన ఆస్తికి సంబంధించిన రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని పూర్తిచేసి ఇక్కడి నుంచి రిలీవింగ్ తీసుకుని కాకినాడ వెళ్లిపోయారని, అంతేకాకుండా తనపై ఉండి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారని రాజ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఇప్పటికే సుధారాణిపై ఎస్‌పి కార్యాలయంలో ఫిర్యాదు చేశానని ఇప్పటివరకు సుధారాణి పై ఎటువంటి చర్యలు తీసుకోలేదని, తనపై ఉండి పోలీసులు కేసు ఫైల్ చేశారని రాజ్ కుమార్ తెలిపారు. తనకు న్యాయం చేయాల్సిందిగా ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

బాధితులకు నిత్యావసరాలు అందజేత

నరసాపురం:మొంథా తుపాను బాధితులైన మండలంలోని కొప్పర్రు, దర్భరేవు గ్రామస్తులకు ప్రభుత్వం అందిస్తున్న నిత్యావసర సరుకులను బొమ్మిడి సునీల్ పంపిణీ చేశారు. తుపాను కారణంగా వేట నిషేధం వల్ల జీవనోపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు బియ్యం, కందిపప్పు, పంచదార, వంటనూనె, ఉల్లిపాయలు, బంగాళదుంపలు వంటి నిత్యావసర సరుకులు అందజేశారు.

పేరుపాలెం బీచ్ వద్ద యాంటీ డ్రోనింగ్ ఏర్పాటు

డిఎస్‌పి శ్రీవేదకు చెక్కు అందజేస్తున్న పోలిశెట్టి శ్రీనివాస్

ప్రజాశక్తి - నరసాపురం

మొగల్తూరు మండలం పేరుపాలెం బీచ్‌లో ప్రమాదవశాత్తూ సముద్రంలో మునిగిపోయి చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రమాదాల నివారణకు నరసాపురం డిఎస్‌పి జి.శ్రీవేద ఆధ్వర్యంలో పేరుపాలెం బీచ్ వద్ద పోలీసులు యాంటీ డ్రోనింగ్ (యుఎవి డ్రోన్ ఫర్ బీచ్ సెక్యూరిటీ) ఏర్పాటు చేస్తున్నారు. ఈ డ్రోన్ ఏర్పాటుకు నరసాపురం మండలం కొప్పర్రు గ్రామానికి చెందిన జనసేన నాయకుడు, ప్రముఖ పారిశ్రామిక వేత్త పోలిశెట్టి శ్రీనివాస్ లక్ష రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. గురువారం నరసాపురం డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి శ్రీవేదకు మొగల్తూరు ఎస్ఐ జి.వాసు సమక్షంలో పోలిశెట్టి శ్రీనివాస్ లక్ష ఆర్థిక సాయం అందజేశారు. గతంలోనూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు రూ.50 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన పోలిశెట్టి శ్రీనివాస్‌ను డిఎస్‌పి శ్రీవేద ప్రత్యేకంగా అభినందించారు. ఇటీవల గుజరాత్‌లోని కేవాడియా వద్ద నిర్వహించిన ఏకతా దివాస్ పరేడ్ కార్యక్రమానికి రాష్ట్ర పోలీస్ బృందానికి నాయకత్వం వహించిన శ్రీవేదకు పోలిశెట్టి శ్రీనివాస్ పుష్పగుచ్ఛం అందజేసి, సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ కె.నాగేంద్రబాబు, శ్రీనివాస్ అనుచరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం తనిఖీలు

నరసాపురం : విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న తహశీల్దార్ సత్యనారాయణ

ప్రజాశక్తి - నరసాపురం

పట్టణంలోని ఎస్ఎన్ఎస్ మున్సిపల్ (లెనిన్ హై) హైస్కూల్‌ను గురువారం తహశీల్దార్ ఐవివి.సత్యనారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకం అమలును అడిగి తెలుసుకున్నారు. అనంతరం తహశీల్దార్ విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం ఎలా ఉంది, ఉపాధ్యాయులు పాఠాలు ఎలా చెబుతున్నారు, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. తహశీల్దార్ మాట్లాడుతూ భోజనం పంపిణీ విధానం అంతా సజావుగా సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు యు.పెద్దిరాజు, ఉపాధ్యాయులు పీడీ హరికృష్ణ, శ్రీనివాసు తదితరులు ఉన్నారు.

మొగల్తూరు : మధ్యాహ్న భోజన పథకంలో నిర్వాహకులు నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్, ఎంపిడిఒ సిహెచ్ త్రిశూలపాణి సూచించారు. ముత్యాలపల్లిలోని బండి ముత్యాలమ్మ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఆయన పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఆయన వెంట హెచ్ఎం పెన్మెత్స రామరాజు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కాళ్ల : ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంపిడిఒ జి.స్వాతి గురువారం పరిశీలించారు. కాళ్ల హైస్కూల్లో ప్రభుత్వ పాఠశాలలో ఆమె విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచి చూశారు. అనంతరం పారిశుధ్యంపై ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రతను పాటించాలన్నారు. ఆమె వెంట టిడిపి మండల అధ్యక్షులు ఆరేటి వెంకట రత్నప్రసాద్, ఎంపిపి పెన్మెత్స శిరీష విశ్వనాదరాజు, ఎంఇఒలు డి.శ్రీనివాసరావు, పాలా యేసుదాసు, పుప్పాల బుజ్జి, బండారు సోమేశ్వరరావు ఉన్నారు.

కాళ్ల : గుడ్లను పరిశీలిస్తున్న ఉప సర్పంచి

వంట ఏజెన్సీ నిర్వాహకులకు నోటీసులు జారీ

కాళ్ల హైస్కూల్ ఉపాధ్యాయులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని చూసుకోవాల్సిన బాధ్యత ఎంతో ఉందని కాళ్ల గ్రామ ఉప సర్పంచి పన్నాసి వెంకటేశ్వరరావు (అబ్బులు) అన్నారు. కాళ్ల హైస్కూల్లో కోడి గుడ్లను ఉప సర్పంచి పన్నాసి వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు, వంట ఏజెన్సీల నిర్లక్ష్యం కారణంగా కుళ్లిన, రంగుమారిన కోడి గుడ్లు వండిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు తన దృష్టికి తీసుకురావడంతో ప్రధానోపాధ్యాయులకు, ఉపాధ్యాయులకు చెప్పామని, అయినా వారి తీరు మారలేదని తెలిపారు. దీనిపై ఎంఇఒకు ఉపసర్పంచి గురువారం ఫిర్యాదు చేశారు. వెంటనే కాళ్ల ఎంఇఒ–2 పాలా యేసుదాసు పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజన పథకం నిర్వహణను పరిశీలించారు. పథకం ప్రదేశం అపరిశుభ్రంగా ఉండడంతో వంట నిర్వాహకులతో మాట్లాడి శుభ్రం చేయించారు. అనంతరం బాధ్యులైన వారికి నోటీసులిచ్చారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ ఇలాంటివి పునరావృతం అయితే వంట ఏజెన్సీని రద్దు చేస్తామని హెచ్చరించారు.

పోడూరు : మధ్యాహ్న భోజనం అమల్లో నిబంధనలు పాటించాలని తహశీల్దార్ సయ్యద్ మౌలానా ఫాజిల్ అన్నారు. జున్నూరు జెడ్‌పి హైస్కూల్లో గురువారం ఆయన మధ్యాహ్న భోజనం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు వడ్డించిన భోజనాలను ఆయన స్వయంగా రుచి చూసి నాణ్యతను పరిశీలించారు. తహశీల్దార్ సిబ్బందితో మాట్లాడుతూ ప్రతిరోజూ కచ్చితంగా మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆదేశించారు. ప్రతిరోజూ వంటకాలను పరిశీలించాలని ఉపాధ్యాయులకు సూచించారు. తహశీల్దార్ వెంట హెచ్ఎం సిహెచ్.శివజ్యోతి, విఆర్ఒ జి.నాగరాజు తదితరులు ఉన్నారు.

1515 హెక్టార్లలో పంట నష్టం : ఎడిఎ

ప్రజాశక్తి - నరసాపురం

మొంథా తుపాన్ కారణంగా సబ్ డివిజన్ పరిధిలో 1515.33 హెక్టార్ల వరకూ వరి పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ ఎడిఎ ప్రసాద్ తెలిపారు. నరసాపురంలో 1,149, మొగల్తూరులో 130, యలమంచిలిలో 235 హెక్టార్ల వరకూ నష్టం జరిగినట్లు సర్వేచేసి నివేదిక జిల్లా అధికారులకు నివేదించామన్నారు. ఈ మూడు మండలాల పరిధి 3,693 మంది రైతుల వరకూ నష్టం జరిగిందన్నారు. వీరి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామన్నారు. ప్రభుత్వం నుంచి పరిహారం విడుదల కాగానే రైతుల ఖాతాల్లో జమ అవుతుందని ఎడిఎ తెలిపారు.

సునీల్‌ను పరామర్శించిన కొవ్వలి ఫౌండేషన్ సభ్యులు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రముఖ వ్యాపారవేత్త, రాజకీయవేత్త చలమలశెట్టి సునీల్ తండ్రి సురేంద్రనాథ్ మృతి చెందిన నేపథ్యంలో గురువారం కొవ్వలి ఫౌండేషన్ సభ్యులు కృష్ణా జిల్లా, మచిలీపట్నంలో వారి స్వగృహానికి వెళ్లి సురేంద్రనాథ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సునీల్, వెంకటేశ్, అనిల్‌ను, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు సోదరి కొవ్వలి ఫౌండేషన్ ట్రెజరర్ కొవ్వలి జయలక్ష్మి, సంకు భాస్కర్ నాయుడు, సత్యదేవ్ తదితరులు ఉన్నారు

ఘనంగా ఎస్‌వికెపి స్వర్ణోత్సవాలు

మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపల్ అప్పారావు

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ ఎస్‌వికెపి డాక్టర్ కెఎస్.రాజు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల అటానమస్‌లో స్వర్ణోత్సవాల్లో భాగంగా పెనుగొండ మార్టేరు పంచ గ్రామాల సర్పంచులు, వార్డు మెంబర్లతో కళాశాల ప్రిన్సిపల్ వైవివి.అప్పారావు అధ్యక్షతన పూర్వ విద్యార్థుల సమీకరణ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాశాల యాజమాన్యం అపారమైన కృషి, పట్టుదల వల్ల అనేక విజయాలను అధిరోహిస్తూ 50 వసంతాలను పూర్తిచేసుకుని స్వర్ణోత్సవాలు జరుపుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులను అనేక మందిని సమీకరించి వారి సహాయ సహకారాలతో స్వర్ణోత్సవాలు ఘనంగా నిర్వహిస్తామని తెలియజేశారు. కళాశాల అధ్యక్షులు తాడి నాగిరెడ్డి, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కలిదిండి రామచంద్ర రాజు మాట్లాడారు. అనంతరం మార్టేరు సర్పంచి కర్రి వేణుబాబు, నెగ్గిపూడి గ్రామ పూర్వ సర్పంచి ప్రస్తుత ఎంపిపి భాస్కర్ రెడ్డి, పెనుగొండ సర్పంచి నక్క శ్యామలసోని, సిద్ధాంతం గ్రామ సర్పంచ్ చంటిబాబు కళాశాలకు తమ వంతు సహకరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో పూర్వ విద్యార్థి విశ్రాంత తెలుగు విభాగాధిపతి రంకిరెడ్డి రామ్మోహనరావు, సుబ్రహ్మణ్యం, వారధి రమణ, పరిసర ప్రాంతాల పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వైసిపి ఆధ్వర్యాన సంతకాల సేకరణ

పెనుమంత్ర:మాజీ మంత్రి, వైసిపి నాయకులు చెరుకువాడ శ్రీ రంగనాథరాజు ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ మాముడూరులో గురువారం నిర్వహించినట్లు వైసిపి మండలకన్వీనర్, సర్పంచి గూడూరి దేవేంద్రుడు తెలిపారు. మాజీ సిఎం జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 17 మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలని కోరుతూ ఆరో రోజు మాముడూరులో కోటి సంతకాల కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి సంతకాలు సేకరించారు. వైసిపి పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షులు పాముల వినోద్ కుమార్, దాట్ల చంటిరాజు, రాజు, పెంటయ్య పాల్గొన్నారు.

క్రైస్తవుల సమస్యలపై ఉద్యమించాలి

కాళ్ల:దేవుని సేవ చేసేవారు దేవుని కోసం ప్రార్థన చేయడంతో పాటు క్రైస్తవుల సమస్యలపై ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని ఎపి క్రిస్టియన్ ప్రొటెక్షన్ అసోసియేషన్ ఫౌండర్ ఛైర్మన్ ఎండి.ఇస్మాయేలు అన్నారు. ఏలూరుపాడులో ఎపి క్రిస్టియన్ ప్రొటెక్షన్ అసోసియేషన్ పాస్టర్స్ విస్తృత స్థాయి సమావేశాన్ని గురువారం నిర్వహించారు.సమావేశానికి నేతల జ్ఞానప్రకాష్ అధ్యక్షత వహించారు. ఇస్మాయేలు మాట్లాడుతూ సమాజంలో ఎస్‌సిలు మతం మారితే కులం మారి పోతుందన్నారు. అధికార, ప్రతి పక్షం రాజకీయ నాయకులు క్రిస్టియన్‌లను పట్టించుకోవడం లేదన్నారు. క్రైస్తవుల గొంతు చట్టసభలలో వినిపించేలా ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు. క్రైస్తవులకు ప్రతి మండలానికీ ఒక స్టడీ సెంటర్ ఏర్పాటు చేయాలన్నారు. క్రిస్టియన్ కార్పొరేషన్ ఛైర్మన్ని త్వరగా నియమించాన్నారు. ఎపిసిపిఎ పొలిటికల్ ప్రెసిడెంట్ రాజేష్ ఖన్నా, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ యేవేలు రాజు, గఫూరు, ఐబిసి నేషనల్ సెక్రటరీ మనోహర్, యుపిఎఫ్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమేష్ పాల్గొన్నారు.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టు–నూజివీడులో

ఓ.యస్.నెం. 362 / 2024

బిట్వీన్ :
పానే శివ నాగరాజు .... వాది
మరియు
మాదు సీతా రామయ్య ... ప్రతివాది
టూ: ప్రతివాది
మాదు సీతారామయ్య తండ్రి. వెంకటేశ్వరరావు, వయస్సు సుమారు 48 సం., వృత్తి: వ్యాపారం, నివాసం: డోర్ నెం. 5–83, గొల్లపల్లి గ్రామం, నూజివీడు మండలం, కృష్ణాజిల్లా.
పై నెంబరు దావాలో ప్రతివాది అయిన మీరు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరు అగుటకు గానూ వాయిదా ది.04–12–2025వ తేదీన అయివున్నది. సదరు తేదీన ఉదయం 10–30 ని.లకు పై పేర్కొనిన శ్రీ కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గానీ, మీ తరపు న్యాయవాది గారి ద్వారా గానీ హాజరు అయ్యి మీ ఆక్షేపణలను తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమునందు తీర్మానించుదురని తెలియజేయటమైనది.

మంకెన నరసింహారావు,
వాది తరపు న్యాయవాది, నూజివీడు,
ఏలూరుజిల్లా. సెల్ నెం. **9440882031**.
నూజివీడు ది.06–11–2025

CHANGE OF NAME

I, **TARAKASATYA SAIRAM KAMBALA** (New Name), S/o. Venkateswara Rao, Previously Called **KAMBALA TARAKA SATYA SAI** (Old Name), Resident of D.No:1-90, Kummara Veedhi, Satyavaram Village, Penumantra Mandal, W.G.Dt, Pin:534122, Andhra pradesh. I have changed my name from **KAMBALA TARAKA SATYA SAI** (Old Name) To **TARAKA SATYA SAIRAM KAMBALA** (New Name) for all practical purposes.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ డిస్టిక్ జడ్జి (MACT) ఏలూరు వారి కోర్టులో

IA.No.1452/2025
O.P.No.153/2025

బిట్వీన్ :
కర్రి వెంకటకళ్యాణి మరియు వగైరాలు ...పిటీషనర్
మరియు
గౌలుగూరి వెంకట శ్రీరామ్ ఆంజనేయ రెడ్డి ...రెస్పాండెంట్
Proposed Party : Gurrala Ramya, W/o.Chennamsetti Manoj Kumar, Owner of Car bearing No.AP-16-CP-0255, D/No.17-3-24, Gannabathulavari Street, Palakollu, W.G.Dist.
పై నంబర్ గ్రంథంలో శ్రీకోర్టు ద్వారా పంపించిన నోటీసులు తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీకోర్టు వారు సబ్‌స్టిట్యూట్ ఉత్తర్వుల ప్రకారం ది.24–11–25న ఉదయం 10.30 గంటలకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా కాని వకీలు ద్వారా కాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఏమైన ఉన్నచో తెలుపుకొనవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

పి.రంగారావు
పిటీషనర్ తరపున న్యాయవాది
ఏలూరు తణుకు.
తేది.6–11–25 సెల్: 9440321132

IN THE HONOURABLE COURT OF THE MACT CUM PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.V.O.P. 117/2025

Between:
Dasari Madhulatha being minor rep by her father and guardian D. Apparao ....Petitioner
And:
Sri P. Srinu and others .....Respondents

NOTICE

Address of the 2nd Respondent:
P. Vijaya Vara Prasad, S/o Krishna Murthy, Owner of Lorry AP 37 TJ 1088, Door No: 4-133, Chinnapalem Village, Poduru Mandal, West Godavari District.
The petitioner filed the above O.P. for grant of compensation on account of injuries sustained by the petitioner and the above O.P. is posted to **13.11.2025 at 10:30 A.M.** before the above Honourable court. Either personally or through an Advocate duly authorized by you, if you fail to appear on **13.11.2025 at 10:30 A.M.**, the matter will be decided in your absence basing on the material available on record.

U.V. Rajesh
Advocate, Door No: 15-1-21,
P. B. Road, Vizianagaram.
Cell : 9440309333.

IN THE HONOURABLE COURT OF THE MACT CUM PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM
M.V.O.P. 137/2025

Between:
Sri Dasari Apparao .... Petitioner
And:
Sri P. Srinu and others .... Respondents

NOTICE

Address of the 2nd Respondent:
P. Vijaya Vara Prasad, S/o. Krishna Murthy, Owner of Lorry AP 37 TJ 1088, Door No: 4-133, Chinnapalem Village, Poduru Mandal, West Godavari District.
The petitioner filed the above O.P. for grant of compensation on account of injuries sustained by the petitioner and the above O.P. is posted to **13.11.2025 at 10:30 A.M.** before the above Honourable court either personally or through an Advocate duly authorized by you, if you fails to appear on **13.11.2025 at 10:30 A.M.** the matter will be decided in your absence basing on the material available on record.

U.V. Rajesh
Advocate, Door No: 15-1-21,
P. B. Road, Vizianagaram.
Cell : 9440309333.